సమర్పించు : ఆవకాయ.కామ్

# కాదంబరి బాల గీతాలు

## మొదటి భాగం


సంపాదకులు :

కడప రఘోత్తమ రావు
కొండముది సాయికిరణ్ కుమార్
ఆవకాయ.కామ్

| విషయ సూచిక | | |
|---|---|---|
| 1 | ఆప్తవాక్యం - ఐ.వి.ఎన్.ఎస్.రాజు | 1 |
| 2 | జేజేలు | 3 |
| 3 | తొందర చేయొద్దమ్మా! | 4 |
| 4 | మొగలిరేకులు | 5 |
| 5 | నెమలీక | 6 |
| 6 | చదువు ముందు | 7 |
| 7 | ఆకులు పూవులు | 8 |
| 8 | లిపి కోవెల | 9 |
| 9 | అచ్చట, ముచ్చట | 10 |
| 10 | ఇది ఏమి వింత! | 11 |
| 11 | బాపు | 12 |
| 12 | వెలుగుల నవ్వులు | 13 |
| 13 | ఋంగమూతి | 14 |
| 14 | దిగి రావోయి జాబిలి! | 15 |
| 15 | చిలక సింహాసనం | 16 |
| 16 | పెదవులపై ఇంద్రధనుసు | 17 |
| 17 | ఋతుజనని | 18 |
| 18 | జల్లులకు వెల్కం | 19 |
| 19 | మెరుపుల బలపం | 20 |
| 20 | ఉషోదయం జనని | 21 |
| 21 | నెలవంకపై చందమామ | 22 |
| 22 | ఓహో మేఘమాల... | 23 |
| 23 | తీపి పలుకులు | 24 |
| 24 | కొంగుబంగారాలు | 25 |

# మర్చిపోయిన నెమలీకలు

**కాదంబరి గారి పదాలు చిన్నప్పుడు నెమలీకలు దాచుకున్న భావాలు. మర్చిపోయిన పలక, బలపం, దూరమైన ఆకు, పూవు ఆత్రంగా స్పర్శించిన పసితనంలో వెలుగులీను ముద్దు మోములు మనసులో దోబూచులాడేలా ఈ పదాలు ఉన్నాయి. ఈ కాలంలో బాలలపై కవితలు బాల్యం గురుతులు చక్కగా గుదిగుచ్చి వ్రాసిన సంపుటి చూడలేదు. కాదంబరి గారు ఈ లోటును సమర్ధం గా తీర్చారనే చెప్పాలి.**

"మబ్బుల పలకల పైన
మెరుపుల బలపాల తోటి
సుందర కావ్యాలను
రాస్తూన్నది అంబరం"

**ఈ వ్యక్తీకరణ ఒక మచ్చుతునక కదూ.**

**అలాగే పుటలు తిరగేస్తే గడచిన చిన్నతనం చప్పన స్ఫురణకు వచ్చేలా పదాల ఎంపిక ఉంది అని చెప్పడంలో ఏ మాత్రం సందేహం లేదు. చదివితే మీకే తెలుస్తుంది.**

"చీకటి బూచీ! ఛల్ ఛల్ ఛల్!
వేకువ మాతా!హల్ చల్ చల్!"

**ఈ వ్యక్తీకరణ నాకైతే చీకటి పట్ల ఉన్న నా బాల్యపు భయాన్ని గుర్తు చెసిన్ది. బాల్యం ఎప్పటికీ అమూల్యం అనే భావనను ఎన్నోసార్లు నిర్ధారించిన సంపుటి ఇది.**

"బడి-గుడి"గంట మోగింది

పెను మత్తు దిగదుడిచి

పరుగో! పరుగు!

ఔను ముఖ్యంగా చలికాలం లో అది పెను మత్తే. పైగా ఎంతకూ తగ్గని చలిలో స్నానం చేసి బడికి సిద్ధం కావడం ఒక పెద్ద సమస్యే. అయితే ఈ సమస్య ఆలస్యం అనే భయంతో చేసిన పరుగులో పటాపంచలే !! అన్నీ తొందరగా ఎంత మధురం !!

మరొకచోట కాదంబరి గారు గులక రాళ్లకు బాల్యానికి ఉన్న అనుబంధాన్ని చక్కగా వ్యక్తీకరించారు:

"చిన్ని రాళ్ళు, గవ్వలనూ

మెల్లమెల్లగా ఏరి, పోగు చేసికుని నేను

ఇపుడే వస్తానుండమ్మా

చిడిమిడి చేయొద్దమ్మా"

ఏది ఒక పద్యం చెప్పు అంటే చిట్టీ చిలకమ్మా.... అంటూ వచ్చీ రాని మాటలతో మొత్తం జ్ఞాపకం ఉన్నా మువ్వల సవ్వడి లాంటి నవ్వులతో మధ్యనే ఆపేసి ఆటలా మార్చేసే తత్వం ఈ "పాట పదములందు-పాప నవ్వు మువ్వలే!" అనే వ్యక్తీకరణ లో నాకు గోచరమైంది .

రండి మీ తరహాలో మీ బాల్యంలోకి మరొక్క సారి వెళ్ళండి ఈ గందరగోళపు వాస్తవాన్ని చదివినంతసేపూ మరచిపోండి .

అభినందనలతో

ఐ.వి.ఎస్.ఎస్. రాజు

# జేజేలు




బడి గంట మ్రోగింది

"బడి-గుడి"గంట మోగింది

పెను మత్తు దిగదుడిచి

పరుగో! పరుగు! **//బడి//**

పలక, బలపం పట్టి

మా గారాల పట్టి

"చదువుల గుడి " వద్దకు

పరుగో! పరుగు! **// బడి//**

చెడును విస్మరించి

మంచి విస్తరించి

కృషితో, చేయి కలిపి

ఎల్ల బాల బాలికలు

మును ముందుకుసాగాలి

చదువుల తల్లికి, సతతం

జేజేలను పలకాలి

# తొందరచేయొద్దమ్మా!



పిల్లగాలి ఊసులన్ని, చిన్నిపూల బాసలన్ని
మనసు విప్పి చెబుతుంటే, ఇపుడే వస్తానుండమ్మా
కొంచెంసేపు ఆగమ్మా //పిల్లగాలి//

వన్నె వన్నె ఈకలను
చిన్ని రాళ్ళు, గవ్వలనూ
మెల్లమెల్లగా ఏరి, పోగు చేసికుని నేను
ఇపుడే వస్తానుండమ్మా
చిడిమిడి చేయొద్దమ్మా

గడ్డిపూల సొగసులన్ని వెన్నెలకందిస్తా
అలల నురుగు చిన్నెలను
హరివిల్లుకు పరిచయం చేసొస్తా
ఇపుడే వస్తానాగమ్మా

అందమైన ప్రకృతికి బల్ సొరె పేరు పెట్టి
ఆనందపు ఋతువులకు అ, ఆలను దిద్దించి
అమ్మా ! నే వస్తాగా
తొందర చేస్తావేమి?

బుల్లి బుల్లి పిట్టలకు మాటలు నేర్పిస్తానే
చిరుజల్లుల వానలను ఆటలు ఆడిస్తానే
అమ్మా ఇపుడే వస్తా!
తొందరచేయొద్దమ్మా!

# మొగలి రేకులు

**తేట తేట తెలుగులోన-పాట పాడరే!**
**పాట పదములందు-పాప నవ్వు మువ్వలే!**

**మొగలి రేకు మాటలన్ని- వెన్నెల జాడలా**
**వరుస, వరుసగాను- పేర్చి,కుట్టి**
**దిష్టి తీయరే! మెటిక విరువరే!**

**భాష తోటలోన - రమ్య సుగంధం**
**మల్లె, జాజి గీతికలై-గుబాళించెను**
**మనసుల లోగిళ్ళన్నీ-ఘుమ ఘుమ లాడెను**

# నెమలీక



చిట్టి చిట్టి పాపాయికి-ఈక ఒకటి దొరికింది
చిట్టి తల్లి ఆ ఈకను- పట్టిపట్టి చూసింది
ఈకంటే ఈక కాదు, కన్నంటే కన్ను కాదు
అది వేడుకైన నెమలి ఈక
కడు మేలైన నెమలి కన్ను

సిరి కన్నుల నింపేను
చిరు వన్నెలు చిందేను
వెన్నెలలో మెరిసేను
వెన్నెలనే మురిపించును
ఇంతింతని చెప్ప లేము
ఔరౌరా!!! దీని సొగసు!!!

అలాంటిలాంటి ఈక ఐతే
అలనాడు కృష్ణయ్య
ఎలా దీన్ని మెచ్చేనట!

# చదువు ముందు



నుడులకు బడలిక తగ్గాలి

బరులకు మత్తులు వదలాలి

అచ్చులు,హల్లుల-జంట నడకలో

కధలకు కదలిక పుట్టాలి

ఏ,బీ,సీలను,బట్టీ పట్టీ

గణితం ముక్కును పిండాలి

సైన్సుకు ఒద్దిక నేర్వాలి

శాస్త్రాలను దారికి తేవాలి!!!

## ఆకులు పూవులు

పలక మీద అచ్చులు

పసిడి మెరుపు పూవులు

వాన చినుకు హల్లులు

పుటల కొలను నందున



పదములు, కావ్యాల

మిసిమి మిసిమి కలువలు

చదువు నేర్చుకుంటేను

చురుకుదనం కలుగుతుంది

మూఢ నమ్మకాలకు

ఇక మీదట ఆట కట్టు



# లిపి కోవెల

బడిలోకి, అక్షరాల గుడిలోకి
పలకలతో వచ్చాము
రండి! నేస్తాల్లారా!
ఆటలూ ఆడేము,పాటలూ నేర్చేము
ఆట పాటల తోటి
చదువులే నేర్చేము

అలకలన్నీ మాని ,అక్క తమ్ముళ్ళార!
అత్త మామల్లార! రా రండి! రారండి!

చదువులలో సారమంత
కొదువ లేకుండానే
ఆది మూలం నుండి నేర్చుకుందాము

పెద్దలూ, పిన్నలూ అందరూ రండి
విద్యల తల్లినీ పూజించుదాము
చదువుతో అబ్బును ఎంచక్క పెద్దరికము!

## అచ్చట, ముచ్చట

విద్య అందరి సొత్తు
అందుకే చేయాలి
అక్షరాలతో పొత్తు
అవనిలో అందరము

అలసటన్నది లేక అక్షరాలను
భావ శిల్పాలు చేద్దాము
కను విందు చేద్దాము

అచ్చులన్నీ కాంతి రేఖలుగ మారాలి
హల్లులన్నీ శాంతి లేఖలుగ నవ్వాలి

## ఇది ఏమి వింత!


పుప్పొడులు చల్లుచూ - పచ్చికల దొర్లుచూ
గోపాలకులతో కూడి గోవిందుడిటు వచ్చి
పిల్లంగ్రోవూదుచూ అందరితో ఆడేను
ఇది ఏమి వింత**???** ఇది ఏమి వింత**!!**

పద్మనాభుడు తాను-పూల పుప్పొడులతో
తనివార ఆడేను**,** బృందావనములోన ఇది

భూదేవి సతి అయ్యు మన్ను తిని మైనలది
పచ్చికలను దొర్లాడు ఇది ఏమి వింత**!**

సాందీపనీ మునివర్యునీ వద్ద-బుద్ధిగా పాఠాలు
భట్టీయము వేయును ఇది ఏమి వింత**!!!**

## బాపు



బోసి నవ్వుల బాపు
నోటి నుండి వచ్చినదె వాక్కు
తను పలికిన పలుకును
జవ దాటనట్టి అపర ఋత్విక్కు!

పట్టినాడు రాట్న చక్రము
త్రిప్పినాడు తెల్ల దొరల
పాలనా జాతక చక్రము

కట్టినాడు కొల్లాయి గుడ్డను
పట్టెడన్నము లేని బీదల,లోన కడుంగడు బీదవాడు

అర్థ లోభము లేని వాడు
అర్థ హీనపు బ్రతుకు నొల్లడు
గాంధి గడిపిన జీవితమ్మే
ధన్య చరితకు పలుకు నాంది

# వెలుగుల నవ్వులు



బాల బాలికల కిల కిల నవ్వులు

ఆటల పాటలు సందడి, హేలలు

ఆహ్లాదాల కావ్య హేలలు తేనెల జల్లులు

ప్రకృతి అంతా నవ రస భరితం

పిల్లల అల్లరి ఒసగిన వరములు

పాల పుంతలు కొలిచిన ముదములు

తొణికిసలాడిన దారులలోన

మిల మిల తారలు నడిచినవి

## బుంగ మూతి

పలక బలపం పట్టి - పరుగు పరుగున
బడికి వచ్చింది వచ్చింది
గారాల పట్టి, మా చిట్టి పాపాయి

పులుకు, పులుకున తాను
ఏమేమొ రాస్తుంది
ఉలుకు, ఉలుకున చూసి
గొప్ప ఫోజులే కొడుతుంది

తళుకు తళుకున నవ్వి- "శ్రీ"లు చుట్టేస్తుంది
"పిచ్చి గీతలు" అనుచూ మేము
ఉట్టుట్టిగంటేను-అలిగి కూర్చుంటూంది!
బుంగ మూతిని పెట్టి

## దిగిరావోయి జాబిలి!

చందమామ! చందమామ! చందమామ



ఎందు దాగి ఉన్నావు చందమామా!

చిన్ని పాప మారాము చేసెనోయీ!

అన్నమింత అంట లేదు చందమామా!

కారు మబ్బు దాగున్న చందమామా!

మా పాపకు గోరు ముద్ద తినిపించ వేగ రావోయీ!

ఆట బొమ్మలంటేను వెగటేసేను!

నే పాట పాడ "వినను"టూ హఠము చేసేను

అమావాస్య మాటు నుండి చందమామా!

మా అమ్మాయి కొరకు రావయ్యా! హఠమును మాని!

## చిలక సింహాసనం

చిలక చిలక రామ చిలక
కళింగ సీమల చిలక సరస్సు
పక్షుల సంబర సామ్రాజ్యమ్ము

చిలక చిలక రామ చిలక
గోదా దేవి భుజమును గారంగ
చేసుకున్నది తన సింహాసనము

చిలక చిలక రామ చిలక
రతీ మదనుల జంటకు కుదిరిన
హొయలుల ప్రియమౌ వాహనము

చిలక చిలక రామ చిలక
మధుర మీనాక్షితో సావాసమ్ము
చిలక జ్యోతిష్యము లోక ప్రసిద్ధము

# పెదవులపై ఇంద్రధనుస్సు

బాగుగ చల్లలు యశోద చిలుకగ
వేగు చుక్కకు మెలకువ రాగా
క్షీరాబ్ధిశయనుడు బిర బిర వచ్చెను
విరాజిల్లెను నిఖిల లోకమ్ములు **||**

ఉగ్గు గిన్నెతో వచ్చేసి
క్రిష్ణుడు **,** అమ్మ చెంగును గుంజాడు
“గుక్కెడు వెన్న**,** చిక్కటి మీగడ
గ్రక్కున ఇవ్వు**,** అంతే**!** చాలనె **" ||**

కొడుకు ముంగురులు సవరిస్తూ
“దుడుకు తనములను మానా”లంటూ **-**
పొంగు నురుగుల గుమ్మ పాలను
తల్లి ఇవ్వగా **-** చిన్ని క్రిష్ణుడు
చెంగున గెంతి**,** గడగడ త్రాగెను **||**

## ఋతుజనని

ఋతుజనని ఆగమనం
ఆబాలగోపాలం హర్ష సంరంభము!
భం భం బోలో!భం భం బోలేరే!!! ||

ఆశువుగా చెప్పగా
మువ్వల సందడిగా
వాక్కునందు అది పద్యం!
భం భం బోలో!!!భం భం బోలేరే!! ||

గోముగ తెలి పుటలపైన
మంజిర నాదములుగా
వెలిసినపుడు అది కావ్యం! ||
భం భం బోలో!!!భం భం బోలేరే!! ||

## జల్లులకు వెల్కం

వాన జల్లు చినుకులార!
వర్ష ధార చెణుకులార!
పుడమికి విచ్చేయండి! ||

మేఘాల పుట్టిల్లు నుండి
చలాకిగా, చమక్కుల
ధరణికి వచ్చేయండి! ||

వసుధ అత్తవారింటికీ
హుషారుగా దిగి రండీ!
దబ్బున వచ్చేయండీ! ||

మెరుపు హౌరా బండి
మీ కోసం రెడీ! రెడీ!
గమ్మున వచ్చేయండీ! ||

పచ్చ పైరు పంటలతో
మైత్రి కలుపుకుందురు గాని
గభాలున రండి రండి ||

## మెరుపుల బలపం

మబ్బుల పలకల పైన
మెరుపుల బలపాల తోటి
సుందర కావ్యాలను
రాస్తూన్నది అంబరం ||

భువనమున ఆమని
అడిగినదీ, ఏమనీ??? _

"వానదేవుడా!
ఈ – నేల పైకి అడుగిడి
హర్షమ్ముల నొసగుమని "
వేడుకొంది ఆమని! ||

రెక్కలను విప్పార్చి
నింగిలోన ఎగురుతూన్న
పక్షులార! రారండీ!
ప్రకృతికీ కిరీటం
మీ ఛాయలు రత్న, మణులు
మమతల ముచ్చట్లు ||

## ఉషోదయం జనని

చీకటి బూచీ! ఛల్ ఛల్ ఛల్!
వేకువ మాతా!హల్ చల్ చల్!

గూళ్ళను విడిచి
విహంగమ్ముల హంగామా!
పిట్టల కువ కువ సందడులు
ప్రకృతి రాణికీ కాలి మువ్వలు:

రైతుల భుజముల
హలములె నగలు,
అవ్వాయ్ తువ్వాయ్ లేగ దూడల
గున గున పరుగులు;

పిల్లలు కట్టే గుజ్జన గూళ్ళు;
సంతోషమ్మే సగము బలమురా!
నిద్దుర మత్తును తుంగల త్రొక్కి
పని పాటలకూ శ్రీ కారం!

చీకటి బూచీ! ఛల్ ఛల్ ఛల్!
వేకువ మాతా!హల్ చల్ చల్!

## సెలవంకపై చందమామ

"ఒకే సారి ఒకే చోట
నెల వంక, జోడీగా
పున్నమీ జాబిల్లి
వెలిసె నెటుల? చెప్పవమ్మ!
ఈ చిక్కు ముడిని విప్పవమ్మ!
ముద్దుగాను అమ్మాయీ!" ||

"జనని గోరు నెల వంక!
ఆ కొన గోటిపైన గోరు ముద్ద –
అరయగాను
అదే నిండు చంద మామ!
ఇదే కదా జవాబు!" ||

“అరెరె! చిటికెలో చెప్పేసినావు;
ఏమి కిటుకు దాచినావు?
వివరించవోయి, అబ్బాయీ!”

"ఇంతప్పటి నుండీ
కన్న తల్లి ఒడిలోన
వెండి గిన్నె – పాల బువ్వ
మారాము చేస్తు తిన్నాము!
ఆ మాత్రం తెలుసుకోమ?
చిట్కా వేరెందులకు?”

# ఓహో మేఘమాల...

గగనాల తారాడు
వయ్యారి జల ధరమా!
సయ్యాటలను నీకు
నేర్పెదము రావమ్మ! ||

హిమ బిందు శత కోటి
మణి పూస లీయుమా!
సొగసైన హారాలు అల్లి
నీకిస్తాము ,బహుమతిగ ! ||

నీలాల నింగిలో సింహాసనమ్మీవు;
లాల పోయించుకుని,నవ్వు పసి పాపవీవు!
గల గలల వర్షాలు వసుధకు ఒసుగుమా!
మా బాలల బులిపాలు నీకు కానుకలమ్మ! ||

## తీపి పలుకులు

*[తాత]:*

చిట్టి పాపా! చిన్ని బాబూ!

బొమ్మలు ఏవీ చూపించండి! ||

*[బాల బాలికలు ]:*

బార్బీ, డిస్నీ, లక్క పిడతలు

బాలు, బ్యాటు, నిర్మల్ బొమ్మలు

ఆడీ ఆడీ – ఇపుడే అటకను సర్దేశాము

*[తాత]:*

చిన్న బాబూ! చిట్టి బాలా!

మీ బుక్కులు ఏవీ? ఎక్కడ ఉన్నయ్?

విజ్ఞానానికి అవి ప్రతీకలు ||

*[బాల బాలికలు ]:*

కార్టూన్, కామిక్స్, నీతి గాథలు

పద్యాల్, పాటలు, సైన్సు, లెక్కలు

అన్నీ నేర్చి, అలమర్లో సర్దేసాము ||

## కొంగుబంగారాలు

అమ్మ నిదుర లేపుతూంటె
బద్ధకముగ ఆవులిస్తూ,
మరల 'బజ్జుని ' "ఊ"లు కొట్టేరు
చిన్నారి పిల్లలు
కాస్సేపు కునుకును తీయ తలచేరు ||

తండ్రి గదమాయించగానే
నిదుర మత్తు ఎగిరి పోగా
బెడ్ నుండీ దూకి, బ్రష్షును
నోటిలోన పెట్టుకుంటూ
విద్యార్థి బాలలు
నురుగు పొంగుల పళ్ళు తోమేరు ||

టిఫిను బుగ్గన కూరుకుంటూ
బుక్కు,నోట్సులు బ్యాగులోన
ఆదర బాదరా సర్దుకుంటూ
హడావుడిగా చిందులేస్తూ
స్టూడెంటు పిల్లలు
ఉరుకు పరుగుల స్టార్టు అయ్యేరు ||

మురిపాల చదువుల
ముద్దు బాల సందడులు సింగారం
నేటి బాలలు భావి పౌరులు
భరత మాత కొంగు బంగారం ||

Download free eBooks from Avakaaya.com: http://www.newaavakaaya.com/Table/Download-eBooks/
Most Popular eBooks from Avakaaya.com

